రోడ్డు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీష్

నిజాంపేట్ : నిజాంపేట్ పరిధిలోని బాచుపల్లి గ్రామంలోని సర్వే నం.345, 406 రేణుక ఎల్లమ్మ కాలనీలో 30 ఫీట్ల రోడ్డుని 40 సెంట్ల అప్రోచ్‌రోడ్‌గా చూపించుకొని అక్రమ అనుమతులు పొందిన రైజ్ హారిజోన్ డెవలపర్స్ వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం ఆకుల సతీష్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్వే నం. 486 ఫ్లాట్ నెంబర్ 114 రేణుక ఎల్లమ్మ కాలనీలో మూడు మీటర్ల రోడ్డు స్థలాన్ని అనుమతులకు విరుద్ధంగా ఆక్రమించుకున్న నిర్మాణంపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. వీటిపై గతంలో ఫిర్యాదు చేసిన మున్సిపల్ అధికారులు సర్వే చేసి మార్కింగ్ మాత్రమే చేసి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని అన్నారు. తక్షణమే రోడ్ ఆక్రమణలను కూల్చివేయాలని, అనుమతులు రద్దు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, కవితారెడ్డి, అరుణ్‌రావు, పివి శ్రీనివాస్, మాధవరావు, మురళి, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతా

జగద్గిరిగుట్ట: సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్‌లో సమస్యలపై పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్ నం.8, 9, 10లలో నూతన సీసీరోడ్లు నిర్మించాలని స్థానికులు మొరపెట్టుకున్నారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే ఈ రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.



అంజయ్యనగర్‌లో సమస్యలపై ఆరా తీస్తున్న కార్పొరేటర్ జగన్

ఘనంగా మే డే

మేడే ఉత్సవాలను గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా కార్మిక సంఘాలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా యూనియన్ల ఆధ్వర్యంలో పరిశ్రమల వద్ద జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా కార్మికుల హక్కుల కోసం పోరాటాలు సాగించిన నాయకుల స్మారకార్థం మేడే ఉత్సవాలను జరుపుకుంటూ వస్తున్నామని, వారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వక్తలు పేర్కొన్నారు. అనంతరం ర్యాలీలు నిర్వహిస్తూ మేడే వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కార్మిక సంఘాల నేతల ముద్దాపురం మదన్‌గౌడ్, చింతల నాగరాజు తదితరులు ఆయా పారిశ్రామికవాడల్లో జరిగిన ఉత్సవాల్లో పాల్గొని కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. – కుత్బుల్లాపూర్



జీడిమెట్ల పారిశ్రామికవాడలోని సైనర్ పరిశ్రమలో జరిగిన మేడే ఉత్సవాల్లో పాల్గొన్న చింతల నాగరాజు



జీడిమెట్ల పారిశ్రామికవాడలో మేడే ఉత్సవాల్లో శ్రమశక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్‌గౌడ్



భగత్‌సింగ్‌నగర్‌లో కామ్రేడ్ సత్యం జెండా ఎగుర వేస్తున్న దృశ్యం



హెచ్‌ఎంటీ, గ్లాండ్ ఫార్మాలో మేడే ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



వసుధ ఫార్మా యూనిట్-1లో జరిగిన వేడుకల్లో జెండా ఎగుర వేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



మేడే ఉత్సవాల్లో మున్సిపల్ కార్మికులను సత్కరించిన కొంపల్లి బీజేపీ అధ్యక్షుడు సతీష్‌సాగర్

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న నేతాజీ హైస్కూల్ ప్రిన్సిపాల్ మహేష్‌కుమార్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ పరిధి భాగ్యలక్ష్మి కాలనీలోని నేతాజీ హై స్కూల్ విద్యార్థులు టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. 100 శాతం రిజల్ట్ సాధించి, దాదాపు 25 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. గ్రీష్మ 572 , ఓ.శశిధర్ 562 , గాడి హర్షితాంజలి 537, గొల్ల ప్రశాంతి యాదవ్ 535, మేఘన 531, అఖిల 523, ఆర్ లక్ష్మి 519, దీక్షిత 518, మణికంఠ 518, మునిల్ 514, అనీష 513, హేమ లక్ష్మి 511, కాజల్ మిశ్రా 510 మార్కులు సాధించారు. పాఠశాల ప్రిన్సిపాల్ చింతల మహేష్ కుమార్, అకాడమీక్ డైరెక్టర్ నందినిలు గురువారం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

మజ్జిగ పంపిణీ

సుభాష్‌నగర్: మండుతున్న ఎండల్లో బాటసారుల దాహార్తిని తీర్చడానికి మేము సైతం అంటూ ఆ అపార్ట్‌మెంట్ మహిళలు కొన్ని రోజులుగా వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. గాజులరామారం డివిజన్ మెట్కానిగూడలోని ఎలిగెన్స్ అపార్ట్‌మెంట్ మహిళలు సంయుక్తంగా కలిసి మధ్యాహ్నం 12గంటల నుంచి 3గంటల వరకు ప్రతిరోజు బాటసారులకు మజ్జిగను పంపిణీ చేస్తున్నారు. వేసవికాలం వరకు ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.



సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బాచుపల్లి మండల విద్యాధికారి రామకృష్ణ



సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ



సమ్మర్ క్యాంప్‌లో శిక్షణకు హాజరైన విద్యార్థులు

నిజాంపేట్: బాచుపల్లి మండలం నిజాంపేట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ క్యాంప్‌ను గురువారం బాచుపల్లి మండల విద్యాధికారి ఎంవీవీ రామకృష్ణ స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘునాథ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమగ్ర శిక్ష – తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు ప్రతిష్టాత్మకంగా మే 1 నుంచి మే 15వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులు యోగా, మెడిటేషన్, వ్యాయామ విద్య, చిత్రలేఖనం, పెయింటింగ్, మ్యూజిక్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఫన్ విత్ మ్యాథ్స్, స్పీడ్ మ్యాథ్స్, కంప్యూటర్ బేసిక్స్ మొదలగు వాటిలో శిక్షణ ఇస్తారని తెలిపారు. అంతేకాకుండా ప్రతి రోజు స్నాక్స్ కూడా అందిస్తారని తెలిపారు. ఈ సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘునాథ్, ఎస్ఆర్‌పి పర్మగళ్ళ నర్సిములు, వాలంటీర్లు లావణ్య, శ్రీదేవి, సుమతి, సరోజ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్లీ బర్డ్ పథకానికి విశేష స్పందన

జంట సర్కిళ్ల పరిధిలో రూ. 37. 57 కోట్ల వసూలు

కుత్బుల్లాపూర్: ముందస్తు పన్నులు చెల్లించే విషయంలో విస్తృత ప్రచారం కల్పించడంతో ప్రజలు పెద్ద ఎత్తున ముందుకొచ్చి ఎర్లీ బర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడంతో జంట సర్కిళ్ల పరిధిలో రూ.37.57కోట్ల పన్నులు వసూలయ్యాయి. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 2025–26 ఆర్థిక సంవత్సరంలో ముందస్తు పన్నులు చెల్లించే వారికి ఎర్లీ బర్డ్ పథకం వర్తిస్తుంది. ఈ నేపథ్యంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో మొత్తం రూ.22.12 కోట్ల రూపాయలు వసూలు కాగా 23, 977 వ్యాపార వాణిజ్య గృహ నిర్వాహకులు వీటిని చెల్లించారు. అదేవిధంగా గాజులరామారం సర్కిల్లో రూ.15. 45 కోట్లు వసూలు కాగా 17,142 మంది పన్నులు కట్టారు. జంట సర్కిల్ ఉప కమిషనర్లు మల్లారెడ్డి, నరసింహ స్థానిక రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రజల్లో ఎర్లీ బర్డ్ పథకంపై విస్తృత ప్రచారం కల్పించడంతో ఎట్టకేలకు అనుకున్న లక్ష్యానికి చేరారు.

నగరంలో మూడో స్థానం..
జోన్‌లో మొదటి స్థానం.!

గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి నేతృత్వంలో ఏకంగా అనుకున్న లక్ష్యానికి మించి ఎర్లీ బర్డ్ పథకం ద్వారా రూ.15.45 కోట్లు వసూలు కావడంతో గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ మొత్తం 30 సర్కిళ్లల్లో మూడో స్థానం నిలువగా.. కూకట్‌పల్లి జోన్ లెవల్‌లో మొదటి స్థానం పొందడం విశేషం. గతంలో కూడా ఇదే తరహాలో ఎర్లీ బర్డ్ పథకం ద్వారా పన్నులు వసూలు చేశారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఎర్లీ బర్డ్ పథకం ద్వారా రూ.34.04 కోట్లు వసూలు కాగా 2025–26 ఆర్థిక సంవత్సరంలో తాజాగా రూ. 37.57 కోట్లు వసూలయ్యాయి.

సంతోషంగా ఉంది..





ప్రజలు రాయితీని సద్వినియోగం చేసుకొని పన్నులు చెల్లించే దిశగా అడుగులు వేసినందుకు సంతోషంగా ఉంది. వారి సహకారంతో కూకట్పల్లి జోన్ పరిధిలో టాప్ వన్ గా నిలిచాము. రాబోయే రోజుల్లో అభివద్ధి సంక్షేమ పథకాలు ప్రజల దరికి చేరాలంటే పన్నులు తప్పనిసరిగా చెల్లించాలని కోరారు. రాబోయే రోజుల్లో సైతం ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కుత్బుల్లాపూర్ గాజులరామారం ఉపకమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి కోరారు.

– ఉపకమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి

అ'పూర్వ' సమ్మేళనం



కుత్బుల్లపూర్: జీడిమెట్ల గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–2002 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం లైన్స్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. చాలా సంవత్సరాల తరువాత కలుసుకోవడంతో భావోద్వేగాలకు లోనై ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువలతో సత్కరించి మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, మోహన్ రెడ్డి, యాదగిరిలు మాట్లాడుతూ తమను గుర్తు పెట్టుకుని సత్కరించడం మరుపురానిదన్నారు. మధ్యాహ్నం పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులతో సహపంక్తి భోజనం చేసి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు.

మేడే రోజు.. కార్మికులతో పనులు.!



దూలపల్లి పారిశ్రామికవాడలో ఎండలో పనిచేస్తున్న కార్మికులు

మే డేను పురస్కరించుకొని ప్రతి కార్మికుడికి సెలవు దినం ఉంటుంది. అది వారి హక్కు. దూలపల్లి పారిశ్రామికవాడలో 40 శాతం మేరా కంపెనీల యాజమాన్యం గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు కార్మికులతో పని చేయించారు. చాలామంది ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులే అధికంగా ఉండటంతో వారికి మేడేపై అవగాహన లేకపోయింది. దీంతో యజమాన్యం బహిరంగంగా మేడే రోజు కూడా వారితో పని చేయించుకుంది. సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కూడా తొంగి చూడలేదు. – సుభాష్‌నగర్